క్లుప్తంగా

వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకుల వితరణ



నిత్యావసర సరుకులు అందజేస్తున్న డాక్టర్ బి.శంకరశర్మ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు సమీపంలోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వద్ద ఉన్న టీజీవీ నగర్‌లోని కృపా వృద్ధాశ్రమానికి సీనియర్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాక్టర్ బి.శంకరశర్మ నెలకు సరిపడే నిత్యావసర సరుకులను ఆదివారం వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మతిస్థిమితం లేని 30 మంది వృద్ధులకు ఆశ్రమ నిర్వాహకులు అబ్రహం ఆశ్రయం కల్పించి పోషిస్తున్నారని తెలిపారు. తన వంతు సాయంగా నిత్యావసర సరుకులను అందజేసినట్లు చెప్పారు. నిస్వార్థంగా ఇలాంటి ఆశ్రమాలు నిర్వహించే వారికి సహాయం చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. భవిష్యత్‌లో ఈ ఆశ్రమానికి మరింత సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు.

జూలై 11, 12న డీవైఎఫ్ఐ జిల్లా మహాసభలు



మాట్లాడుతున్న డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్

కర్నూలు(సెంట్రల్): డీవైఎఫ్ఐ జిల్లా మహాసభలను జూలై 11, 12 తేదీల్లో కర్నూలులో నిర్వహించనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, వై.నగేష్ తెలిపారు. ఈ మహాసభలకు జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి వేల సంఖ్యలో యువతీ, యువకులు హాజరై సంఘీభావం తెలపాలని కోరారు. ఆదివారం డీవైఎఫ్ఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. డీవైఎఫ్ఐ 1980లో ఏర్పడిన నాటి నుంచి యువత పక్షాన పోరాటాలకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. జిల్లాలో యువతీ, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం నిత్యం పోరాటాలు చేస్తున్నట్లు వివరించారు. అంతేకాక గంజాయి, సారా, మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ఘనత డీవైఎఫ్ఐకు దక్కుతుందన్నారు. ఈ క్రమంలో కర్నూలులో జరిగే డీవైఎఫ్ఐ 19వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు హరికిషన్‌రెడ్డి, అంజి, విశ్వనాయుడు, సుధాకర్, రాము, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

సూర్యాలయంలో సినీ హీరో ఆకాష్ పూజలు



ఆకాశ్‌కు జ్ఞాపిక అందిస్తున్న ఆలయ ట్రస్ట్ సభ్యులు

కర్నూలు కల్చరల్: ప్రముఖ సినీ దర్శకుడు పూరీ జగన్నాథ్ తనయుడు సినీ హీరో ఆకాష్ పూరి ఆదివారం కర్నూలు నగరంలో సందడి చేశారు. కుటుంబంతో కలిసి శ్రీ సూర్య నారాయణ స్వామి ఆలయాన్ని సందర్శించారు. సూర్య భగవానుడికి విశేష పూజలు, అభిషేకం, అర్చనలు జరిపించారు. దేవాలయంలోని దేవీ దేవతలను దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆలయ మర్యాదలతో గౌరవించి ఆశీర్వదించారు.

ప్రతిభ చాటిన గురుకుల విద్యార్థులు

కల్లూరు: మండల పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఐఐటీ, మెడికల్ అకాడమీ విద్యార్థులు ఆదివారం రాత్రి వెలువడిన ఏపీఈఏపీ సెట్ 2025 ఫలితాల్లో ప్రతిభ చాటారు. అకాడమీలో ఇంటర్మీడియెట్‌తో పాటు ఐఐటీ, మెడికల్ శిక్షణ ఇస్తారు. ఈ క్రమంలో ఈఏపీసెట్ బైపీసీ విభాగంలో 51 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా కుమ్మరి గణేష్ 113.44 మార్కులతో రాష్ట్రస్థాయిలో 357వ ర్యాంకు సాధించారు. జి.సురేంద్ర 1258వ ర్యాంకు, ఎం.సాయి 2155వ ర్యాంకు, కె.సాయికృష్ణ 2241వ ర్యాంకు, చోప్రా జ్యోతిష్ కుమార్ 2,391వ ర్యాంకు, ఎస్.ధనుష్ 4511వ ర్యాంకు, ఎంపీసీ విభాగంలో మొత్తం 39 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. పి.నవదీప్ 76.41 మార్కులతో 4996వ ర్యాంకు సాధించారు. బి.నానాజీ నాయక్ 4986వ ర్యాంకు, పి.అఖిల్ కుమార్ 5295వ ర్యాంకు, ఎం.నాగ కార్తీక్ రెడ్డి 3508వ ర్యాంకు సాధించారు. కార్పొరేట్ సంస్థలకు ధీటుగా ర్యాంకులు సాధించడంతో డీసీఓ ఐ.శ్రీదేవి, అకాడమీ డైరెక్టర్ ఉమామహేశ్వరప్ప, అధ్యాపక బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

మహానందిలో భక్తుల సందడి

మహానంది: క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వేలాది మంది భక్తులు ఆలయానికి చేరుకుని స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి,మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు.

ఆ ఎస్ఆర్ రూటే సపరేటు

- నిబంధనల మేరకు ఉన్న వాటిని కూడా నిలిపివేస్తున్న వైనం
- సవరణలకు కూడా డబ్బు వసూలు
- డాక్యుమెంట్ రైటర్ల ద్వారానే వసూళ్ల పర్వం
- తలలు పట్టుకుంటున్న క్రయ, విక్రయదారులు



కర్నూలు(సెంట్రల్): కర్నూలు నగర కేంద్రంలోని ఓ సబ్ రిజిస్ట్రార్ (ఎస్ఆర్) వసూళ్ల పర్వానికి దిగారు. డబ్బులు ఇవ్వనిదే ఏ పని చేయరని డాక్యుమెంట్ రైటర్లు, క్రయ, విక్రయదారులు బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. డాక్యుమెంట్లు నిబంధనల మేరకు ఉన్నా కనీస మొత్తం ముట్టజెపితే తప్పా రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముందుకెళ్లదనే వాదనలు వినిపిస్తున్నాయి. దీంతో క్రయ,విక్రయదారులు తలలు పట్టుకుంటున్నారు.

కొర్రీలు వేయడం లాగడం..

ఇటీవల కర్నూలు నగరంలోని బుధవారపేటలో ఓ కొత్త షాపు రిజిస్ట్రేషన్‌కు వచ్చింది. మునిసిపల్ కార్పొరేషన్ దానికి పన్ను (ట్యాక్స్) అసెస్‌మెంట్ నంబర్ ఇవ్వలేదు. దీంతో విక్రయదారుడు ఆ షాపునకు సంబంధించి అసెస్‌మెంట్ నంబర్ లేకపోవడంతో పన్ను చెల్లించలేదు. ఈ క్రమంలో సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేయాలంటే పన్ను చెల్లించాలని కొర్రీ వేశారు. అయితే వినియోగదారులు పన్ను చెల్లించేందుకు అసెస్‌మెంట్ నంబర్ రాలేదంటే తానే నేరుగా మునిసిపల్ కమిషనర్‌కు లేఖ రాసి నంబర్ వేయిస్తానని, పన్ను కట్టిన తరువాతే రిజిస్ట్రేషన్‌కు రావాలని వెనక్కి పంపారు. తరువాత ఏమి జరిగిందో ఏమో తెలియదు కాని రిజిస్ట్రేషన్ ప్రక్రియ మాత్రం ముగిసి పోయింది. పన్ను కట్టకుండానే రిజిస్ట్రేషన్‌ను సంబంధిత సబ్ రిజిస్ట్రార్ ముగించారంటే ఏమి జరిగి ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇలా వచ్చిన డాక్యుమెంట్లలో కొర్రీ ఏది ఉందో తెలుసుకొని రైటర్ల ద్వారానే డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రతి డాక్యుమెంట్‌కు వసూలు

ఇటీవల రియల్ ఎస్టేట్ రంగం పడిపోవడంతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో డాక్యుమెంట్ల సంఖ్య తక్కువగా ఉంది. ఎక్కువగా బ్యాంకు మార్టిగేజ్‌లు,సవరణలు,కొన్ని డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్‌లు ఉంటున్నాయి. ఇందులో సవరణలకు సంబంధించి నిబంధనల మేరకు ఉన్నా కొర్రీలు వేసి సదరు సబ్ రిజిస్ట్రార్ వసూళ్ల పర్వం సాగిస్తున్నారు. అలాగే బ్యాంకు మార్టిగేజ్‌లపై కూడా క్షుణ్ణంగా పరిశీలన చేసి వారాలకు వారాలు పెండింగ్‌లో పెడుతున్నట్లు తెలుస్తోంది. ఇక వచ్చిన రిజిస్ట్రేషన్లకు సంబంధించి ప్రతి డాక్యుమెంట్‌కు కనీసమైనా ఇప్పించకపోతే ఆ డాక్యుమెంట్‌ను పక్కన పెట్టి వేధిస్తున్నట్లు తెలుస్తోంది. ఆ సబ్ రిజిస్ట్రార్ వ్యవహార శైలితో క్రయ, విక్రయదారులు తలలు పట్టుకుంటున్నారు.డాక్యుమెంట్ రైటర్ల కోసమే ప్రత్యేక రిజిస్టర్ నిర్వహణ సంబంధిత సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డాక్యుమెంట్ రైటర్ల కోసమే ప్రత్యేకంగా ఓ రిజిస్టర్‌ను నిర్వహిస్తున్నారు. అందులో రోజులో డాక్యుమెంట్ రైటర్ ద్వారా ఎన్ని రిజిస్ట్రేషన్లు జరిగాయో నమోదు చేస్తారు. తరువాత అన్ని రిజిస్ట్రేషన్లకు సంబంధించిన డబ్బులను వారి నుంచి వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో డాక్యుమెంట్ రైటర్లు రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం అధికారులు పావలా అడిగితే వినియోగదారుల నుంచి రూపాయి వసూలు చేసి అందిస్తున్నారు. కాగా, రిజిస్టర్‌లో ఏ రోజు ఎవరు రిజిస్ట్రేషన్ చేసుకున్నారో ఆ వివరాలు ఉంటే మంచిది. కానీ, ఇక్కడ మాత్రం డాక్యుమెంట్ రైటర్ల వివరాలను నమోదు చేసుకోవడం గమనార్హం.

బ్రెయిన్ ట్యూమర్ ప్రాణాంతకం

కర్నూలు(హాస్పిటల్): బ్రెయిన్ ట్యూమర్ ప్రాణాంతక వ్యాధి అని న్యూరోసర్జన్ డాక్టర్ కేఎస్.విశ్వకుమార్ చెప్పారు. వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే సందర్భంగా ఆదివారం స్థానిక మెడికవర్ హాస్పిటల్‌లో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బ్రెయిన్ ట్యూమర్ వ్యాధిలో మెదడులో ఏర్పడిన కణితులు దాని పనితీరుకు అంతరాయం కలిగిస్తాయన్నారు. దీనివల్ల నడకలో ఇబ్బంది, స్వల్పకాలిక జ్ఞాపకశక్తి కోల్పోవడం, ఏకాగ్రత పెట్టకపోవడం వంటి సమస్యలతో పాటు అనేక నాడీ సమస్యలు వస్తాయన్నారు. దీంతో పాటు మెదడులోని కణజాలాలు అసాధారణంగా పెరుగుతాయన్నారు. ఈ కణాలు క్యాన్సర్‌గా మారే అవకాశం ఉందని చెప్పారు. దీనికి చికిత్స చేయకపోతే మరణానికి దారి తీసే అవకాశం ఉందని చెప్పారు. బ్రెయిన్ ట్యూమర్ లక్షణాలను ముందుగా గుర్తించి చికిత్స చేయించుకోవాలని సూచించారు. ఆస్పత్రి క్లస్టర్ హెడ్ వై.మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ రేడియేషన్‌కు దూరంగా ఉండాలని, ఆరోగ్యకరమైన జీవన విధానం అలవాటు చేసుకోవాలని సూచించారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



పాల్గొన్న భక్తులు



అలంకరణలో జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులు

కర్నూలు కల్చరల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ఇస్కాన్ ప్రవచకులు హిరణ్మయ అచ్యుత దాస్ పేర్కొన్నారు. స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని పూరి జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత శిక్షణ తరగతులు, శీల ప్రభుపాదుల ప్రేమ విందు కార్యక్రమాలు జరిగాయి. జగన్నాథ్, బలదేవ్, సుభద్ర మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగవద్గీత పఠనం, శ్రవణం ఉత్తమ జీవితానికి మార్గం చూపుతాయన్నారు. సమయం సద్వినియోగం చేసుకుంటూ దేవాలయాలు, ఆధ్యాత్మిక కేంద్రాలను సందర్శించాలన్నారు. ప్రవచనకర్తల సందేశాన్ని విని ఆచరించాలన్నారు. హరే రామ హరే కృష్ణ జప యజ్ఞం చేయించి హరినామ సంకీర్తనలు ఆలపించారు. అనంతరం జగన్నాథ్, బలదేవ్, సుభద్రలకు రాజభోగ నివేదన చేసి అన్న ప్రసాద వితరణ చేశారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవాలని సూచించారు. అలాగే కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లో అధికారులు వినతులను స్వీకరిస్తారని ఆయన వెల్లడించారు.

అర్జీల పరిష్కార సమాచారం కోసం 1100 నంబర్

అర్జీదారులు తమ దరఖాస్తు పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవడం కోసం కాల్ సెంటర్ నంబర్ 1100కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే అర్జీదారులు meekosam.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు.

నేడు నగరపాలక సంస్థలో..

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కమిషనర్ రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభం అవుతుందని, అన్ని విభాగాల అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైన సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

కొనసాగిన సంతకాల సేకరణ



సంతకాల సేకరణ చేపట్టిన సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కరోనా సమయంలో రద్దైన రైళ్లను పునరుద్ధరించాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. ఆదివారం బళ్లారి చౌరస్తా సమీపంలో చేపట్టిన సంతకాల సేకరణకు ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.జగన్నాథం మాట్లాడుతూ.. కరోనా సమయంలో రద్దు చేసిన ప్యాసింజర్ రైళ్లను వెంటనే పునరుద్ధరించాలన్నారు. సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉన్నా రైళ్లను రద్దు చేయడం అన్యాయమన్నారు. వాటి స్థానంలో వందే భారత్, రాజధాని, డబుల్ డెక్కర్ రైళ్లను నడపుతూ సొమ్ము చేసుకోవడం మంచిది కాదన్నారు. ప్యాసింజర్ రైళ్ల లేకపోవడంతో గ్రామీణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. చాలా ఊళ్లలో రైల్వే స్టేషన్లు ఉన్నా రైళ్లు ఆగకపోవడంతో ప్రజలు తీవ్ర నిరాశ పడుతున్నట్లు చెప్పారు. కాగా, సోమవారం అన్ని రైల్వే స్టేషన్ల ఎదుట ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. సీపీఐ నగర సహాయ కార్యదర్శి దంబోళం శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో సత్తా చాటండి



క్రీడాకారులను అభినందిస్తున్న మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ శమంతకమణి

కర్నూలు (టౌన్): అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ చాటాలని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ నగరూరు శమంతకమణి సూచించారు. జూనియర్, క్యాడెట్, జూనియర్, సీనియర్స్ విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన 45 మంది క్రీడాకారులను ఆమె ఆదివారం తన కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కర్నూలు నగరంలో తైక్వాండో క్రీడాంశంలో విద్యార్థినీ, విద్యార్థులు చక్కగా రాణిస్తున్నారన్నారు. తైక్వాండో ఇన్‌చార్జ్ సతీష్ కుమార్, రాయలసీమ ఫిట్‌నెస్ అండ్ సెల్ఫ్ డిఫెన్స్ అకాడమీ అధ్యక్షురాలు సోమేశ్వరి, మాస్టర్లు వీరేష్ బాబు, శివన్న, కామర్తి, భరత్ పాల్గొన్నారు.

ఆరోగ్యకరమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం





జగన్నాథ గట్టు రూపాల సంగమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో యోగా కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

కర్నూలు కల్చరల్: ఆరోగ్యకరమైన, సంపన్నమైన, సంతోషకరమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో భాగంగా యోగాంధ్ర క్యాంపెయిన్ జరుగుతోందని కర్నూలు ఆర్డీఓ సందీప్‌కుమార్ అన్నారు. ఆదివారం నగర శివారులోని జగన్నాథగట్టు రూపాల సంగమేశ్వర స్వామి ఆలయం ప్రాంగణంలో యోగా కార్యక్రమం జరిగింది. యోగా శిక్షకుల ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ నెల 21వ తేదీన నిర్వహించనున్న ప్రపంచ యోగా దినోత్సవంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. సెట్కూరు సీఈఓ డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుదారు. దేవదాయ శాఖ ఏసీ సుధాకర్, కర్నూలు మండల తహసీల్దార్ రమేష్, సర్పంచ్‌లు మాధవస్వామి, జయన్న, యోగా అసోసియేషన్ కార్యదర్శి అవినాష్, తదితరులు పాల్గొన్నారు.

ఈఏపీసెట్‌లో సత్తా

కర్నూలు (సిటీ): రాష్ట్రస్థాయిలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించే ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో పలు కార్పొరేట్ కాలేజీలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. శ్రీచైతన్య జూనియర్ కాలేజీలకు చెందిన విద్యార్థులు బి.లక్ష్మీకాంత్ 363వ ర్యాంకు, బి.వశిష్ఠకృష్ణ 427వ ర్యాంకు, జి.హిమవంత్ కుమార్ 852వ ర్యాంకు, ఆర్.ఉపేందర్‌రెడ్డి 873వ ర్యాంకు, టి.శ్వేత 918వ ర్యాంకు సాధించినట్లు ఆ కాలేజీల ఏజీఎం కె.మురళీకృష్ణ తెలిపారు.

- ఈఏపీసెట్‌లో నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు సత్తా చాటాయని ఆ కాలేజీ డీజీఎం టి.గోవర్ధన్ రెడ్డి తెలిపారు. అగ్రికల్చర్ ఫార్మసీలో డి.హేమసాగరిక 21వ ర్యాంకు, ఆర్.గోవర్ధన్ చౌదరి – 65, సఫా సైఫ్ ఖురేషీ – 90, పి.దీపిక – 102, ఎం.అఖిల్ బాలాజీనాయక్ – 104, వి.గురు పార్థీవ్ – 124, ఎం.సంహిత – 213, డి.శ్రీసాయి ఫణీంద్ర – 237, ఎం.కార్తీక – 320, కె.గౌతమి – 353, ఆర్.దివ్యశ్రీ – 397 ర్యాంకులు సాధించారు. ఇంజినీరింగ్ విభాగంలో కె.చరణ్‌కుమార్ 220, టి.నితిన్ సాయికుమార్ 232, కె.జీవన్ కుమార్ 305 ర్యాంకులు సాధించినట్లు వెల్లడించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులు, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు.

ఏపీ ఎన్జీఓ నేతలకు జిల్లా నేతల అభినందనలు

కర్నూలు (అగ్రికల్చర్): ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేసి ఇటీవల పదవీ విరమణ చేసిన శివారెడ్డిని జిల్లా ఎన్జీఓ నేతలు ఘనంగా సత్కరించారు. ఆదివారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో జిల్లా శాఖ నాయకులు పి.రామకృష్ణా రెడ్డి, సాంబశివారెడ్డి, రమణ, భాస్కర్‌నాయుడు తదితరులు కలిసి పదవీ విరమణ చేసిన శివారెడ్డిని శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. ఇటీవల రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన విద్యాసాగర్‌ను కూడా కలిసి సత్కరించారు. ఉద్యోగుల పెండింగ్ డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించే విధంగా ఒత్తిడి పెంచాలని కోరారు.

దేవరగట్టులో భక్తిశ్రద్ధలతో పూజలు



మాళ మల్లేశ్వరస్వామికి పూజలు నిర్వహిస్తున్న పూజారులు

హొళగుంద: దేవరగట్టులో ఆదివారం మాళ మల్లేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో పూజలు జరిగాయి. పూజారులు స్వామి వారికి సుప్రభాత సేవ, అభిషేకాలు, బండారార్చన, పుష్పార్చన, మహామంగళ హారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించి నైవేద్యం సమర్పించారు. స్వామిని దర్శించుకోవడానికి స్థానికులే కాకండ పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు స్థానిక ఆస్పరి మఠంలో అన్నదానం చేపట్టారు.

శనగల బసవన్నకు విశేష పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని శ్రీస్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగల బసవన్నకు ఆదివారం అర్చకులు శాస్త్రోక్తంగా విశేష పూజలు నిర్వహించారు. శుద్ధ త్రయోదశి, బహుళ త్రయోదశి రోజుల్లో నందీశ్వరస్వామి పూజను భక్తులు పరోక్షంగా నిర్వహించుకునే అవకాశం దేవస్థానం కల్పించింది. ఆదివారం 17మంది భక్తులు పరోక్షసేవగా నందీశ్వరస్వామి పూజను జరిపించుకున్నారు. స్వామి వారికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలను నిర్వహించారు. ఆరంభ పూజలలో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకలం పఠించారు. అనంతరం కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. తదనంతరం నందీశ్వర స్వామికి శాస్త్రోక్తంగా పంచామృతాలు, ఫలోదకాలు, మల్లికాగుండంలోని శుద్ధ జలంతో అభిషేకం జరిపించారు. చివరగా.. నూతన వస్త్రసమర్పణ, విశేషార్చన, నానపెట్టిన శనగలను నైవేద్యంగా సమర్పించి కర్పూరనీరాజనాలు అర్పించారు.

ఎల్లమ్మ ఆలయ పునర్నిర్మాణం ప్రారంభం



వెంకాయపల్లె ఎల్లమ్మ



దాత రాజ్‌కుమార్

కర్నూలు కల్చరల్: మండల పరిధిలోని వెంకాయపల్లె గ్రామ సమీపంలో వెలసిన ఎల్లమ్మ దేవత ఆలయం పునర్నిర్మాణ పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. దేవదాయ శాఖ అనుమతులతో ప్రస్తుతం ఆలయం ఉన్న స్థానంలో రూ.2 కోట్లతో నూతన ఆలయ నిర్మాణం పనులు ప్రారంభించారు. ఆలయ పునర్నిర్మాణానికి తమిళ చిత్ర నిర్మాత రాజ్‌కుమార్ రూ.2 కోట్లు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెన్నై నగరంలో స్థిరపడిన తన తల్లి సొంత గ్రామం కర్నూలు సమీపంలోని నాగలాపురం అని తెలిపారు. చిన్నతనం నుంచి చెన్నై నుంచి అమ్మతో వచ్చి నాగలాపురం సుంకులమ్మ, వెంకాయపల్లె ఎల్లమ్మను దర్శించుకునేవారమని చెప్పారు. అమ్మవారు తమ ఇష్ట దైవమని చెప్పారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయం విశాలంగా ఉండాలనే ఉద్దేశంతో ఆలయ పునర్నిర్మాణానికి ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఈవో రాధాకృష్ణ మాట్లాడుతూ.. ఆలయ పునర్నిర్మాణం దృష్ట్యా అమ్మవారి గర్భగుడిలో ఉన్న విగ్రహానికి శాంతి పూజలు, హోమాలు, నిర్వహించి యాగ మండపంలో పాల అమ్మవారిగా ఉంచడం జరిగిందన్నారు. భక్తులు యథావిధిగా అమ్మవారిని దర్శించుకొని పూజలు నిర్వహించవచ్చన్నారు. సంవత్సరంలోగా ఆలయ నిర్మాణ పనులు పూర్తవుతాయని వెల్లడించారు.

మార్షల్ ఆర్ట్స్‌తో ఆత్మస్థైర్యం పెంపొందుతుంది



విద్యార్థులకు బెల్ట్‌లు ప్రదానం చేసిన ఒలింపిక్ సంఘం కార్యదర్శి శ్రీనివాసులు

కర్నూలు (టౌన్): మార్షల్‌ఆర్ట్స్ వల్ల ప్రతి విద్యార్థినీ, విద్యార్థికి ఆత్మస్థైర్యం పెంపొందుతుందని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి జి.శ్రీనివాసులు అన్నారు. ఆదివారం స్థానిక పెద్ద మార్కెట్ వద్ద ఉన్న ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రాంగణంలో విద్యార్థినీ, విద్యార్థులకు బెల్ట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశలో ఏదో ఒక క్రీడాంశాన్ని ఎంచుకొని సాధన చేయాలన్నారు. క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తులో మంచి అవకాశాలు వస్తాయన్నారు. అనంతరం బెల్ట్ పోటీల్లో ప్రతిభ కనబరచిన క్రీడాకారులకు గ్రీన్, ఆరెంజ్, రెడ్ బెల్టులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో గంగాధర్, యూనివర్సల్ బుడోఖాన్ కరాటే వ్యవస్థాపకులు టి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

సైక్లింగ్‌తో ఆరోగ్యం



సైక్లింగ్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న కర్నూలు రైల్వేస్టేషన్ మాస్టర్ శేషఫణి

కర్నూలు (టౌన్): ప్రతి రోజు క్రమం తప్పకుండా సైక్లింగ్ చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు శారీరకంగా దృఢంగా ఉంటారని కర్నూలు రైల్వే స్టేషన్ మాస్టర్ శేషఫణి అన్నారు. ఆదివారం స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయి) ఆధ్వర్యంలో సైక్లింగ్ ర్యాలీని ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ రాం మోహన్, చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ మున్నాజీ రావుతో కలిసి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైల్వే మాస్టర్ మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన జీవనం కోసం ప్రతి రోజు సైకిల్ తొక్కాలన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం 26 వారాల పాటు సైక్లింగ్ సండేస్ పేరుతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తాందన్నారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఇన్‌చార్జ్ చంద్రశేఖర్, సైక్లింగ్ కో–ఆర్డినేటర్ కార్తికేయన్, అసిస్టెంట్ కో–ఆర్డినేటర్ జతిన్, జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి డాక్టర్ రుద్రా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు

పాములపాడు: మండలంలోని రుద్రవరం గ్రామంలో కాశీముక్కంటి ఈశ్వరస్వామి ఆలయల విగ్రహ, ధ్వజ ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా రాష్ట్ర స్థాయి కబడ్డీ (పురుషులు) పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు విజయ్, శివ ఆదివారం తెలిపారు. ఈ నెల 10 నుంచి పోటీలు ప్రారంభమవుతాయన్నారు.విజేతలకు వరుసగా తొలి ఐదు స్థానాలకు రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేలు, రూ.3 వేలు, రూ. 2 వేల చొప్పున నగదు అందజేస్తారన్నారు. పోటీల్లో పాల్గొనదలిచిన జట్టు 9వ తేదీలోపు రూ. 300 ప్రవేశ రుసుము చెల్లించి పేరు నమోదు చేయించుకోవాలన్నారు. వివరాలకు 96428 82600 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

పెద్దాసుపత్రి ఇన్‌గేటు ముందు అడ్డంగా నిలిపిన ఆటోలు



పెద్దాసుపత్రిలోకి వెళ్లే దారేది!

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఇటీవల ప్రారంభించిన ఇన్‌గేట్ వద్ద ఆటోల రద్దీ అధికమైంది. ప్రధాన గేటు ముందుగానే ఆటోలు నిలిచి ఉండటంతో బయటి నుంచి ఆసుపత్రి లోపలికి వెళ్లే వాహనాలకు దారి ఉండటం లేదు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గేటు ముందు ఆటోలు నిలిచి ఉండటంతో వాహనాలు ఆసుపత్రిలోకి వెళ్లేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆసుపత్రిలోని సెక్యూరిటీ గార్డులు ఇన్ గేటు లోపల మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. బయట ఉంటే ఆటోలను నియంత్రించే అవకాశం ఉంటుంది. కానీ ఆటోల డ్రైవర్లు తమ మాట వినరని సెక్యూరిటీ గార్డులు చెబుతున్నారు. బయటి ట్రాఫిక్ విషయాన్ని ట్రాఫిక్ పోలీసులే చూసుకోవాలని ఆసుపత్రి అధికారులు చెబుతున్నారు. దీనికితోడు యథాలాపంగా గేటు ముందు వ్యాపారాలు కొనసాగుతుండటం గమనార్హం.

– కర్నూలు(హాస్పిటల్)